

మేడ్చల్‌జిల్లా అదనపు కలెక్టర్‌గా రాధికా గుప్తా



మేడ్చల్ జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా రాధికాగుప్తా బదిలీపై వచ్చారు. హన్మకొండ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పని చేసిన రాధికాగుప్తా బదిలీపై మేడ్చల్ జిల్లాకు వచ్చారు. మేడ్చల్ జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన అభిషేక్ అగస్త్యా ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.



యాచారంలో సాగు చేసిన వరి

విస్తారంగా వర్షాలు

సాగు ముమ్మరం!

పంటల సాగు జోరందుకుంది. ఉమ్మడి జిల్లాలో ముసురు వానలు పడుతుండడంతో ఎండు ముఖం పట్టిన మెట్ట పంటలు ఊపిరి పోసుకున్నాయి. వర్షాలు లేక సాగు మొదలు పెట్టని రైతులు కూడా ఇప్పుడు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. వర్షాలు లేకపోవడం వల్ల ప్రధానంగా వరిసాగు వెనుకబడింది. ఇప్పుడు ఆ పంట సాగు కూడా జోరందుకుంది. నిన్న మొన్నటి దాకా ఎండిపోతున్న పంటలు ఇప్పుడు పచ్చగా మారడంతో రైతుల ముఖంలో ఆనందం తాండవిస్తుంది. సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను కూడా వ్యసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంచడంతో సాగు పరుగులు పెడుతోంది.

- మళ్లీ ఊపందుకున్న వ్యవసాయ పనులు
- మూడు జిల్లాల్లో సాధారణంకంటే అధిక వర్షపాతం
- వారంలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- వికారాబాద్‌లో 57.66శాతం సాగు
- రంగారెడ్డి జిల్లాలో 39.11శాతం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గడిచిన వారం రోజులుగా వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో దండిగా వర్షాలు పడుతుండడంతో రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు సమృద్ధిగా చేరుతోంది. భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. దీంతో మళ్లీ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వారం రోజుల నుంచి జోరుగా వ్యవసాయ పనులు జరుగుతుండడంతో వివిధ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో అంతంత మాత్రంగానే వర్షాలు పడడంతో వ్యవసాయ పనులు మందకొడిగా సాగిన విషయం తెలిసిందే. వానాకాలం ఆరంభంలో మెట్ట ప్రాంతాల్లో వేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. అయితే వారం రోజుల నుంచి వర్షాలు పడుతుండడంతో రైతులంతా ఊరట చెందుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో ఇప్పటికే వేసిన పంటలకు ఈ వర్షాలు ఊపిరి పోశాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మూడు జిల్లాల్లో కూడా సగటుకు మించి వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో సాధారణం కంటే 51శాతం అధికంగా వర్షాలు కురవడం గమనార్హం. అలాగే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సాధారణం కంటే 5 శాతం అధికంగా ఈ సీజన్‌లో వర్షాలు పడ్డాయి. దీంతో వివిధ పంటలు వేసేందుకు ఎదురు చూస్తున్న రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సంతోషపడుతున్నారు. పంటలు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం విస్తారంగా పడుతున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో వారం రోజులుగా దాదాపు 10శాతానికి పైగా సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు వికారాబాద్ జిల్లాలో 57.66 శాతం పంటలు సాగు చేయగా రంగారెడ్డి జిల్లాలో 39.11 శాతం, మేడ్చల్ జిల్లాలో 17.56 శాతం రైతులు వివిధ పంటలు సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో 3.32లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేయగా రంగారెడ్డి జిల్లాలో 1,54,989 ఎకరాలు, వికారాబాద్‌లో 4,043 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో మరో వారం రోజుల్లో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వివిధ పంటల సాగు విస్తీర్ణం 70 శాతానికి చేరుకుంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పత్తి పంటను రైతులు అత్యధికంగా సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో పత్తి 2.02లక్షల ఎకరాల్లో, రంగారెడ్డి జిల్లాలో 1.06లక్షల ఎకరాల్లో పత్తి పంట వేశారు. ఈ ఏడాది పత్తి సాగుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపడంతో ప్రభుత్వం పత్తిసాగుకు ప్రాధాన్యత ఇస్తోంది. వరి సాగు ఇప్పటి వరకు కేవలం 5శాతం కూడా మించలేదు. వర్షాలు సకాలంలో పడక పోవడంతో వరిసాగు ఆలస్యమవుతోంది. అయితే, ఉమ్మడి జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో నాట్లు వేసేందుకు రైతులు నారు సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరినాట్లు కూడా ముమ్మరంగా సాగే అవకాశాలు ఉన్నాయి. సన్నరకాల వరిని సాగు చేసే రైతులకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. సర్కార్ ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలం వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే వర్షాలు మరో నాలుగైదు రోజులు ఇంకా కొనసాగే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. వర్షాలు ఇదేవిధంగా మరికొన్ని రోజులు కొనసాగితే ఈ నెలాఖరు నాటికి పంటలు సాగు విస్తీర్ణం మరింత గణనీయంగా పెరిగి సాధారణ సగటును మించే అవకాశాలు ఉంటాయి.

విత్తనాలు, ఎరువులు సిద్ధం

మరోవైపు వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో సీజన్‌కు సరిపడా విత్తనాలు, రసాయన ఎరువుల నిల్వలను అధికారులు సిద్ధం చేశారు. ఎరువులు, విత్తనాల కొరత ఎక్కడా లేదని రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు.

మూడు జిల్లాల్లో వర్షపాతం (మిల్లీమీటర్లు)

జిల్లా	ఏడాది సగటు	జూలై 20 వరకు సగటు వర్షం	శాతం	అధికం/లోటు
రంగారెడ్డి	725	185	194	5శాతం అధికం
వికారాబాద్	799	216.5	326.4	51శాతం అధికం
మేడ్చల్	796	213.5	223.5	5శాతం అధికం

వానాకాలం వ్యవసాయ సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

జిల్లా	సాధారణ సాగు	ప్రస్తుత సాగు	శాతం
రంగారెడ్డి	3,96,269	1,54,989	39.11
వికారాబాద్	5,77,508	3,32,840	57.63
మేడ్చల్	23,026	4043	17.56

రంగారెడ్డి జిల్లాలో పంటల వారీగా సాగు (ఎకరాల్లో)

పంట	సగటు సాగు	ప్రస్తుత సాగు
పత్తి	1,77,735	1,06,924
వరి	1,00,608	1,842
మొక్కజొన్న	68,549	25,210
కంది	29,227	3,687
జొన్న	13,476	2,822
ఇతర పంటలు	6,674	14,504
మొత్తం	3,96,269	1,54,989



నారాయణపూర్ చెక్‌డ్యాంలో జలకళ

ముంచెత్తిన ముసురు

ఉమ్మడి జిల్లాలో ఎడతెరపి లేని వాన

ఉమ్మడి జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. శుక్రవారం రాత్రి ప్రారంభమైన వర్షం శనివారం రోజంతా కొనసాగింది. కురుస్తున్న వర్షాలకు వాగుల్లో వరద ఉధృతి పెరుగుతోంది. చెరువుల్లోకి క్రమంగా నీరు చేరుతోంది. వర్షాలు సకాలంలో కురియక పంటల సాగుకు కొంత ఇబ్బందులు ఏర్పడగా, రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వేసిన పంటలు కళకళలాడుతున్నాయి. ముసురు వానతో రహదారులు గుంతలమయంగా మారాయి. రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందుల పడ్డారు.

- నారాయణపూర్ చెక్‌డ్యాంకు జలకళ
- నిండిన చెరువులు, కుంటలు
- పొలాల్లో చేరిన వర్షపునీరు
- వర్షానికి కూలిన ఇండ్లు
- గుంతలమయంగా రోడ్లు
- విద్యుత్‌సరఫరాలో అంతరాయం
- స్తంభించిన జనజీవనం
- ఇబ్బందులు పడిన చిరువ్యాపారులు

వికారాబాద్/మేడ్చల్/రంగారెడ్డి అర్బన్(ఆంధ్రజ్యోతి)/తాండూరు/మర్పల్లి/బొంరాస్‌పేట్/పరిగి/యాలాల/ఘట్‌కేసర్/కేశంపేట/శంకర్‌పల్లి, జూలై 20 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎడతెరపి లేని వర్షంతో జనజీవనం స్తంభించింది. శుక్రవారం రాత్రి ప్రారంభమైన వర్షం శనివారం రోజంతా కొనసాగింది. చెరువులు, కుంటల్లోకి నీరు వరద నీరు చేరింది. వాగులు వంకలు ప్రవహిస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు, ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. తాండూరు మండలంలో పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. వ్యవసాయ పనులు ఆగిపోయాయి. సిరిగిరిపేట్, అల్లాపూర్, రాంపూర్, ఎల్మకన్నెతోపాటు పలు గ్రామాల్లోని చెరువుల్లోకి వర్షపునీరు వచ్చింది. అదేవిధంగా వర్షంతో తాండూరు ప్రాంతంలోని కాగ్నానది ప్రవహించడంతో నారాయణపూర్, ఎల్మకన్నె, చిట్టిఘనా పూర్ చెక్‌డ్యాంలోకి వర్షం నీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. దీంతో రైత్నులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండొద్దని అధికారులు అన్నారు.

ఉమ్మడి జిల్లాలో వర్షపాతం వివరాలు

ప్రాంతం	వర్షపాతం (మి.మీ)
మహాదేవపురం	26.3
బాచుపల్లి	25.5
కూకట్‌పల్లి	24.3
శంకర్‌పల్లి	22.0
సరూర్‌నగర్	21.8
రాజేంద్రనగర్	21.3
పొద్దటూరు	21.0
మల్కాజిగిరి	20.3
మేడ్చల్	20.0
కులకచర్ల	19.8
వికారాబాద్	18.5

సాధారణం కంటే ఎక్కువ..

వికారాబాద్ జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగానే వర్షాలు కురిశాయి. జూన్ ఒకటి నుంచి జూలై 20వ తేదీ

మిగతా 7లో



ఫత్తేపూర్ ఫ్లైఓవర్ కింద నిలిచిన వరద నీరు

ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలి



విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నకలెక్టర్ గౌతమ్

మేడ్చల్ టౌన్, జూలై 20 : నిరుపేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం మేడ్చల్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిరచిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసి స్వీకరిస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకం కోసం పెట్టుకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని అధికారులను సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేరదీసిన నాడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అనంతరం మేడ్చల్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. అమ్మబడి పథకం కింద పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారును ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మధ్యాహ్నం భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠ్యపుస్తకాల పంపిణీ, బోధన, మధ్యాహ్న భోజనం తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ సీఈవో దిలీప్ కుమార్, తహసీల్దార్ శైలజ, జిల్లావిద్యాధికారి విజయకుమారి, ఎంపీడీవో వసంత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాపై కదలిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బఫర్‌జోన్‌లో మట్టి, రాళ్లు నింపిన వారిపై కేసు నమోదు



బఫర్‌జోన్‌లో వేసిన రాళ్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ పరమేష్, ఎస్‌ఐ శేఖర్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 20 : బఫర్ జోన్ కబ్జాపై శనివారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'బఫర్‌జోన్ కబ్జా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, ఏఈ అరిగే పరమేష్ మర్రిపల్లిగూడ సర్వేనెంబర్ 55లోని లక్ష్మీనారాయణ చెరువు బఫర్‌జోన్‌లో నింపిన మట్టిని, రాళ్లను పరిశీలించారు. బఫర్ జోన్‌లో అక్రమంగా మట్టి, రాళ్ల నింపిన గడీల కృష్ణారెడ్డి, జగన్‌రెడ్డిలపై ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్‌ఐ శేఖర్, ఇరిగేషన్ ఏఈ పరమేష్ బఫర్‌జోన్‌లో పోసిన మట్టిని, రాళ్లను పరిశీలించి పంచనామ చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, కుంటలు, సాగునీటి కాలువ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

దొంగనోట్ల ముఠా అరెస్ట్

- రూ. 7.95లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూలై 20 : నకిలీ నోట్లు చలమణి చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద రూ. 7.95 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసులకు పక్కా సమాచారం రావడంతో శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో తాండూరు పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన మండిగి చంద్రప్ప ఇంట్లో సోదాలు చేశామన్నారు. అతని వద్ద రూ.45 వేలు నకిలీ 500 నోట్లు లభ్యం కావడం జరిగిందని, అతన్ని విచారించగా మరో ముగ్గురు పేరు వెలుగులోకి రాగా ఇచ్ఛాపురం జగదీశ్, బడుగంటి వీర వెంకటరమణ , ప్రగల్ల పాటి శివకుమార్‌లను దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారివద్ద రూ.7.50లక్షల నకిలీ 500నోట్లతో పాటు కంప్యూటర్ మానిటర్, సీపీయూ, ప్రింటర్, పేపర్లు, రిబ్బన్, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇచ్ఛాపురం జగదీశ్ గతంలో బ్యాంక్ నిధులను దుర్వినియోగంలో జహీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని కంది జైలులో ఒక నెల శిక్ష అనుభవించాడని తెలిపారు. వెంకటరమణ గంజాయి అక్రమ రవాణా కేసులో జహీరాబాద్‌తో పాటు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేసు నమోదైందన్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని, ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో పాటు సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ శ్రీరాములు పోలీస్ సిబ్బందిని అభినందించి రివార్డులు ఎస్పీ అందించారు.



విద్యార్థులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి



విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రజిత

మర్పల్లి, జూలై 20 : విద్యార్థులను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రజిత సూచించారు. శనివారం మండల పరిధిలోని పంచలింగాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సెల్‌ఫోన్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని, సెల్‌ఫోన్‌కు బానిసలు కావద్దని సూచించారు. విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు, సీఆర్‌పీ మల్లేశం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ శాంతమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



శంషాబాద్, జూలై 20: శంషాబాద్‌లోని వివిధ బస్తీల్లోని పోచమ్మ, మైసమ్మ ఆలయాలు ఆదివారం(నేడు) జరగనున్న బోనాల ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. పోచమ్మబస్తీ, మధురానగర్, రాళ్లగూడ, ఇంద్రారెడ్డినగర్, ఆదర్శనగర్, ఆర్బీనగర్, సిద్ధాంతి, సాతంరాయి ప్రాంతాల్లోని ఆలయాలను విద్యుత్ లైట్లతో అలంకరించారు. ఆలయాల సమీపంలో భద్రతా ఏర్పట్లను ఆర్జీఐఏ పోలీసులు చేపట్టారు.

పనిచేయని 'రెవెన్యూ' ప్రింటర్

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పాస్‌బుక్‌లలో వివరాలు నమోదుగాక ఆందోళన



తహసీల్దార్ కార్యాలయంలో పక్కన పడేసిన ప్రింటర్

కేశంపేట, జూలై 20 : తహసీల్దార్ కార్యాలయంలో ప్రింటర్ పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తరువాత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారు. భూమి రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే విక్రయించిన వ్యక్తికి సంబంధించిన భూమిని, కొనుగోలు చేసిన వ్యక్తికి బదలాయిస్తారు. ఇది పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారానే కొనసాగుతుంది. రిజిస్ట్రేషన్ అనంతరం భూమి అమ్మిన రైతు పట్టాదారు పాస్‌పుస్తకంలో మిగిలిన ఉన్న భూమి వివరాలను నమోదు చేసి ఇవ్వాలి. అయితే, కేశంపేట తహసీల్దార్ కార్యాలయంలో కొద్ది నెలలుగా ప్రింటర్ పనిచేయకపోవడంతో ఈ ప్రక్రియ నిలిపివేశారు. రిపేరులో ఉన్న ప్రింటర్‌ను ఓ మూలన పడేశారు. దాంతో రైతులు తమ భూమి వివరాలను పాస్‌బుక్‌లో నమోదు చేయించుకోవడానికి నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. భూములు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో చలానా రూపంలో డబ్బులు చెల్లిస్తున్నా.. కనీసం ప్రింటర్‌కు రిపేర్ చేయకపోవడం ఏంటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో ప్రింటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాస్‌బుక్‌లో వివరాల నమోదు ఎలా?



నేను, తమ్ముడు కలిసి మా నాన్న మాకిచ్చిన భూమిని విరాసత్ ద్వారా ధరణిలో మ్యుటేషన్ చేయించుకున్నాం. ఆ సమయంలో విరాసత్‌కు చలానా కట్టాం. అయితే, మా తమ్ముడికి కొత్త పాసుపుస్తకం సీసీఎల్‌ఏ నుంచి వారం రోజుల్లో వచ్చింది. నాకు పట్టాదారు పాసుపుస్తకం ఉండడంతో తహసీల్దార్ కార్యాలయంలోనే ప్రింటింగ్ చేసి ఇస్తారని చెప్పారు. ప్రింటర్ రిపేరులో ఉందని చెప్పి పంపించారు. వివరాల నమోదుకు నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని కావడం లేదు.

\- యాచవరం నర్సింహారెడ్డి, వేముల్‌నర్వ

ప్రింటర్ రిపేరులో ఉంది



తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ప్రింటర్ ప్రస్తుతం పనిచేయడం లేదు. ప్రింటర్‌లో ఉన్న బోర్డు పూర్తిగా దెబ్బతినడంతో కాపీలు ఇవ్వడం వీలుకావడం లేదు. ప్రింటర్ రిపేరుకు ఉన్న విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే రిపేర్ చేయించి రైతులకు అందుబాటులోకి తెస్తాం. అంతవరకు ఓపిక పట్టాలని కోరుతున్నాం.

\- మీర్ అజంఅలీ, తహసీల్దార్, కేశంపేట

ప్రమోషన్లతో ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న గోవర్ధన్‌యాదవ్

ఆమనగల్లు, జూలై 20 : ఉపాధ్యాయుల పదోన్నతులతో ఖాళీ అయిన టీచర్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లులోని బాలుర, బాలికల, బస్టాండ్ ఉన్నత పాఠశాల్లో శనివారం గోవర్ధన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాండు, మండల అధ్యక్షుడు సుదర్శన్‌లతో యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సబ్జెక్టుల వారీగా మిగిలిన టీచర్ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలన్నారు. అదనపు క్యాడర్ సంఖ్యను సవరించి జిల్లాకు న్యాయం చేయాలన్నారు. జీవో 11ను సవరించి బీఈడీ టీచర్లకు పీఎస్‌హెచ్‌ఎం పోస్టులివ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రకటించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి చంద్ర, చెన్నకేశవరెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు ట్రెజరీ ద్వారా వేతనాలివ్వాలి

చేవెళ్ల, జూలై 20: ట్రెజరీ ద్వారా వేతనం ఇవ్వాలని చేవెళ్ల మోడల్ స్కూల్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు అన్నారు. శనివారం చేవెళ్లలోని మోడల్ స్కూల్‌లో భోజన విరామ సమయంలో వారు నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ టీనావతికి వినతిపత్రం ఇచ్చారు. 010 పద్దు ద్వారా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని కోరారు. 11 ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని అన్నారు. అలాగే మూడు నెలలుగా తమకు వేతనాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ టీచర్లు సునీత, వంశీధర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్‌గౌడ్, రుక్మిణి, శ్రీదేవి, మల్లీశ్వరి, అస్మా, అమీర్, అనంత, యశోద, సుధీర, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, శివ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.




నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు













బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రవీందర్



రవీందర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆనంద్‌గౌడ్

శంషాబాద్ రూరల్, జూలై 20: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శంషాబాద్ మండలం పెద్దగోల్కొండకు చెందిన బోయిని రవీందర్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ శనివారం నియామకపత్రాన్ని అందజేశారు. రవీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ పదవి ఇచ్చిందని, నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ పటిష్టతకు కృషిచేస్తానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా మనోహర్



నియామకపత్రం అందుకుంటున్న మనోహర్

మహేశ్వరం, జూలై 20: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ కొండూరి మనోహర్ ఎన్నికయ్యారు. శనివారం నగరంలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మనోహర్‌కు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామకపత్రం అందజేశారు. మనోహర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు చెబుతున్నారన్నారు. బీజేపీ బలోపేతానికి, దళితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



టాస్క్ ప్రతినిధిని సన్మానిస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 20: కళాశాల్లో ఏర్పాటు చేసే వివిధ రకాలైన పైథాన్ కార్యక్రమాల్లో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని టాస్క్(తెలంగాణ అకాడమి ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ప్రతినిధి రాకేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం జరిగిన 'హార్నెసింగ్ ది పొటెన్షియల్ ఆఫ్ పైథాన్ విత్ జంగో' ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు కాలంలో యువ ఇంజినీర్లకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. సాంకేతిక, వృత్తి నైపుణాలపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం యూనివర్సిటీ డీన్లు రాకేష్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. సీఎస్‌సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'విజయ' చిల్లింగ్ స్టేషన్ సామర్థ్యాన్ని పెంచాలి



శివాల్కర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మాడ్గుల, జూలై 20 : మాడ్గులలోని విజయ డెయిరీ చిల్లింగ్ స్టేషన్ సామర్థ్యాన్ని పెంచాలని షాద్‌నగర్ విజయ డెయిరీ డీడీ శివాల్కర్‌యాదవ్‌ను మాడ్గుల స్టేషన్ చైర్మన్ బొజ్జా సాయిరెడ్డి, ఆమనగల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి కోరారు. షాద్‌నగర్‌లోని డెయిరీ కార్యాలయంలో శనివారం వారు డిప్యూటీ డైరెక్టర్ సన్మానించి వినతిపత్రం ఇచ్చారు. మాడ్గుల చిల్లింగ్ స్టేషన్ సామార్థ్యాన్ని 8,000 లీటర్ల నుంచి పది వేల లీటర్లకు పెంచి పెద్ద ట్యాంకర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కావాల్సిన నిధులను కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ద్వారా మంజూరు చేయిస్తామని తెలిపారు. ఇందుకు మాడ్గుల సొసైటీ ద్వారా ప్రతిపాదనలు పంపాలని అధికారిని కోరారు.

'ధరణి' పెండింగ్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి, జూలై 20: రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం పరిగి పట్టణ శివారులోని వెంకటసాయి, శివశక్తి రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పరిగి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దన్నారు. ప్రతీ ఫిర్యాదుకు పరిష్కార మార్గాన్ని చూపించాలని సూచించారు. భూముల విస్తీర్ణంలో ఏమైనా తప్పులు దొర్లినట్లయితే రైతుల ద్వారా దరఖాస్తులను తీసుకొని పరిశీలించి సరిచేయాలన్నారు. రైస్ మిల్లర్లు లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్‌ను వేగవంతం చేయాలని సూచించారు. ఎఫ్‌సీఐకి ఇచ్చిన గడువులోగా సీఎంఆర్ చేరవేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, డిప్యూటీ తహసీల్దార్లు సుగుణ, మల్లిఖార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, జూలై 20 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా 50 శాతం బీజేపీ నాయకులు గెలిచేలా ఇప్పటి నుంచే కార్యాచరణ మొదలుపెట్టాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో విశ్వేశ్వర్‌రెడ్డికి సన్మానం, సత్కార కార్యక్రమం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని మండలాల నుంచి వచ్చిన నాయకులు ఎంపీని ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, తన గెలుపు కోసం కార్యకర్తలు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా క్యాకర్తలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. బీజేపీకి బలమైన కార్యకర్తలు ఉన్నారని, ఎప్పటికప్పుడు అన్ని మండలాలు, గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులు చేపడతానన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతామన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పనులు తొందరగా ప్రారంభించేలా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఒప్పిస్తానని చెప్పారు. ప్రధాని మోదీ తెలంగాణకు ఇదివరకే రూ.9వేల కోట్ల నిధులు ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రం ప్రభుత్వం వద్ద ఖాజానా ఖాళీగా ఉందని, మోదీ దయతోనే రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రకాశ్, ప్రభాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి, నాయకులు కుంచం శ్రీనివాస్, కృష్ణగౌడ్, అనంత్‌రెడ్డి, నర్సింలు, వాసుదేవ్‌కన్నా, కృష్ణగౌడ్, వైభవ్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, రవీందర్, శ్రీనివాస్, నాగరాజు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ముంచెత్తిన ముసురు


మర్పల్లి మండలం కొత్లాపూర్‌లో కూలిన ఇల్లు

5వ పేజీ తరువాయి..

వరకు జిల్లాలో 216.5 మి.మీ. సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 326.4 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలో నవాబ్‌పేట, వికారాబాద్, పూడూరు, పరిగి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మిగతా మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లాలో 19.2 సగటు వర్షపాతం నమోదైంది. తాండూరులో ఏడ తెరిపి వానతో జనజీవనం స్తంభించింది. తాండూరు పట్టణంలో పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో బసవన్న కట్ట వద్ద రోడ్లపైన, ఇందిరా చౌక్‌లో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. పలు కాలనీలలో రోడ్లపై వర్షపు నీరు నిలిచి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భవానీనగర్, గ్రీన్ సిటీ, ఇంద్రానగర్, ఎన్టీఆర్ కాలనీ, ఆదర్శనగర్ చాలా చోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలిచాయి. మర్పల్లి మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వంట గది లేకపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వర్షంలోనే వంట ఏజెన్సీ నిర్వాహకులు మధ్యాహ్నం తయారు చేసి విద్యార్థులకు అందించారు.పరిగి పట్టణంలోని పలు కాలనీలు బురదమయంగా మారాయి. ముఖ్యంగా తిరుమల రెసిడెన్సీలో రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. యాలాల మండలంలో పత్తి చేనుల్లోకి వర్షం చేరింది. చెరువులు, కుంటల్లోకి వర్షం నీరు వచ్చి చేరుతుంది. ఘట్‌కేసర్‌లో ఎడతెరిపి వర్షంతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వికారాబాద్ జిల్లా వర్షపాతం వివరాలు

మండలం	నమోదైన వర్షపాతం (మి.మీ.)
బషీరాబాద్	17.5
మోమిన్‌పేట్	16.3
నవాబ్‌పేట్	16.0
పరిగి	16.0
దోమ	15.8
కోట్‌పల్లి	15.8
పూడూరు	15.5
చౌడాపూర్	14.8
మర్పల్లి	13.8
పెద్దేముల్	13.3
ధారూరు	13.3
బంట్వారం	13.0
తాండూరు	13.0
దౌల్తాబాద్	13.0
యాలాల్	12.5
కొడంగల్	12.3
బొంరాస్‌పేట్	10.3
దుద్యాల్	5.8

కూలిన ఇళ్లు

వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో గొల్ల శ్రీశైలం ఇల్లు శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి కూలిపోయింది. ఈ సంఘటనలో పెను ప్రమాదం తప్పిందని బాధితులు తెలిపారు. అదేవిధంగా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండల కేంద్రానికి చెందిన ఆకారపు రమేశ్ ఇంటి పైకప్పు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. రాత్రి సమయంలో కుటుంబ సభ్యులు వేరే ఇంట్లో ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేశంపేట మండల వ్యాప్తంగా ముసురు వాన కురిసింది. ఇప్పలపల్లి, వేముల్‌నర్వ, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, సంతాపూర్, కొనాయపల్లి, లింగంధన గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. ఏదైన సమస్య ఉత్పన్నమైతే వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

దెబ్బతిన్న రహదారులు

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలో రోడ్లు దెబ్బతిన్నాయి. శంకర్‌పల్లి-ఫత్తేపురం మధ్య రోడ్డు పూర్తిగా పాడయింది. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫత్తేపురం ఫ్లై ఓవర్ కింద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి గుండాన్ని తలపించే విధంగా నీళ్ల నిలవగా ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడ్డారు. బ్రిడ్జి వద్ద రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో గుంతల్లో నీళ్ల నిలిచాయి. అదేవిధంగా కేశంపేట మండలంలో ముసురు వానతో మట్టి రోడ్లు పూర్తిగా చిత్తడిగా మారాయి. దాంతో మట్టి రోడ్లలో నడవడానికి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.


దుద్యాల్‌లో కూలిన ఇల్లు


పంచలింగాల ప్రాథమిక పాఠశాలలో వర్షంలోనే భోజనం వండుతున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కోసం తీవ్ర పోటీ

- రిజర్వేషన్ల ప్రకారమే కేటాయిస్తారా? లేక మార్చి నియమిస్తారా?
- అధికార పార్టీలో చర్చనీయాంశంగా మారిన మార్కెట్ చైర్మన్ల పదవులు

వికారాబాద్, జూలై 20 : నామినేటెడ్ పదవుల భర్తీపై చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో ఉండే వ్యవసాయ మార్కెట్ కమిటీల పదవుల కోసం అధికార పార్టీ నాయకులు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో ధారూరు, వికారాబాద్, మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రి తమకు అనుకూలంగా ఉండే నాయకుల పేర్లను సిఫారసు చేసేవారు. కాగా, గత ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను విడతల వారీగా ఒక్కో కేటగిరీకి రిజర్వు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. 2018, మే నెలలో అప్పటి ప్రభుత్వం ఏయే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఏ విడతలో ఏ కేటగిరీకి రిజర్వు చేశారనేది నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ పరిధిలో వికారాబాద్, ధారూరు, మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు వర్తింపజేసిన తరువాత ఇప్పటివరకు ఒక్కో వ్యవసాయ మార్కెట్‌కు మూడు పాలకవర్గాలను నియమించగా, ఈసారి నాలుగో విడత పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. కాగా, నియోజకవర్గం పరిధిలో ఉన్న మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాల చైర్మన్ పదవుల్లో రెండు బీసీ-ఏ జనరల్‌కు రిజర్వు కాగా, ఒకటి జనరల్‌కు రిజర్వు చేశారు. ఈసారి వికారాబాద్, మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులు బీసీ-ఏ కేటగిరీకి రిజర్వు చేయగా, ధారూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి జనరల్‌కు కేటాయించారు. అయితే, గత ప్రభుత్వ హయాంలో చేసిన రిజర్వేషన్ల ప్రకారమే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల నియామకం చేపడతారా? లేక ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉండే నాయకులకు అవకాశం కల్పిస్తారా అనేది స్పష్టత లేదు. బీసీ-ఏ జనరల్ కేటగిరీకి రిజర్వు చేసిన వికారాబాద్, మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు జనరల్ కేటగిరీకి చెందిన నాయకులు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. వికారాబాద్, మర్పల్లి మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులు బీసీ-ఏ జనరల్‌కు రిజర్వు చేసినట్లు అధికార పార్టీ నాయకులకు తెలిసినా.. తమకే చైర్మన్ పదవి కట్టబెట్టాలంటూ జనరల్ కేటగిరి నాయకులు తమ ప్రయత్రాలు తీవ్రతరం చేస్తున్నారు. కాగా, రిజర్వేషన్ ప్రకారం కేటాయించిన వారికే వికారాబాద్, మర్పల్లి, ధారూరు మార్కెట్ కమిటీల చైర్మన్ పదవుల నియామకం చేపడతారా? లేక తాము నిర్ణయించిన నాయకులకే కేటాయిస్తారా అనేది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

అర్హులందరికీ 'గృహజ్యోతి' వర్తింపజేయాలి

కొడంగల్, జూలై 20: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం అర్హులైన లబ్ధిదారులకు వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. శనివారం కొడంగల్ మున్సిపల్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. విద్యుత్ జీరో బిల్లు, గ్యాస్ సిలిండర్ సబ్సిడిపై వస్తుందా అని హనుమాన్ దేవాలయం సమీపంలోని వడ్డర్‌గల్లీలో ఓ కుటుంబాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇందుకు లబ్ధిదారులు విద్యుత్ జీరో బిల్లు వస్తుందని, గ్యాస్ సబ్సిడీకి సంబంధించి బ్యాంకు ఖాతాల్లో చూసుకోవాలన్నారు. అనంతరం కొడంగల్ పట్టణంలో నిర్మించిన రోడ్లు, మురుగు కాలువల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం పనులను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని, అభివృద్ధి పనుల వివరాలను సంబంధిత ఇంజనీర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, కమిషనర్ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్‌లో అభివృద్ధి పనుల గురించి అధికారులనడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

తప్పుడు ప్రకటనలతో భక్తులను అయోమయానికి గురిచేయొద్దు

- చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్

మొయినాబాద్ రూరల్, జూలై 20 : కలియుగ దైవం చిలుకూరు బాలాజీ దేవాలయం విషయంలో భక్తులను అయోమయానికి గురిచేసేలా సోషల్ మీడియాలో తప్పుడు ప్రకటనలు ప్రచారం చేయొద్దని ప్రధాన అర్చకుడు సీఎస్ సీఎస్ రంగరాజన్ విజ్ఞప్తి చేశారు. నేడు(ఆదివారం) వివాహం విషయంలో ఆలస్యమయ్యే వారికోసం చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని, గత వారం రోజులుగా సోషల్‌మీడియా తాను చెప్పినట్లు కొన్ని యూట్యూబ్ చానళ్లలో ప్రసారమవుతున్న ప్రకటన తప్పు అని చెప్పారు. ఈమేరకు శనివారం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయంలో రంగరాజన్ మాట్లాడారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత ఏప్రిల్ 21న కల్యాణోత్సవం సందర్భంగా వివాహం ఆలస్యమవుతున్న వారు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని ప్రకటించడం జరిగిందని, ప్రస్తుతం కొందరు కావాలనే తప్పుగా ప్రచారం చేయడం తగదని తెలిపారు. అలాంటి కార్యక్రమాలు ఏమైనా ఉంటే కొన్ని రోజులముందే ప్రకటిస్తామన్నారు. ఇలాంటి తప్పుడు ప్రకటనలను ప్రసారం చేయవద్దని యూట్యూబ్ చానళ్ల నిర్వాహకులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. నేడు(ఆదివారం) ఆలయంలో ఎటువంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం లేదని చెప్పారు. భక్తులు గమనించాలని ఆయన సూచించారు.


మాట్లాడుతున్న రంగరాజన్

కలెక్టర్‌ను కలిసిన గురునాథ్‌రెడ్డి



కలెక్టర్‌తో గురునాథ్‌రెడ్డి, కేకేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న యాదయ్య

కొడంగల్/నవాబుపేట, జూలై 20: తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిశారు. శనివారం కొడంగల్‌లో పర్యటించిన కలెక్టర్‌ను స్థానిక ఐబీలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గురునాథ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియామకమైన మాజీ ఎంపీ కేశవరావును, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగిసిన ఉద్యోగుల బదిలీ ప్రక్రియ

- నేటి నుంచి మళ్లీ నిషేధం అమలులోకి
- రేపటి నుంచి కొత్త స్థానాలకు ఉద్యోగులు

తాండూరు, జూలై 20: 15 రోజుల పాటు కొనసాగిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు శనివారం ఫుల్‌స్టాప్ పడింది. నేటి(ఆదివారం) నుంచి ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమలులోకి వచ్చింది. ఈజీవోఎంఎస్ నెంబర్ 80ని అనుసరించి ఈ నెల 5నుంచి 20వ తేదీ వరకు బదిలీల ప్రక్రియను చేపట్టారు. మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య, రెవెన్యూ, వ్యవసాయ, పశు సంవర్ధక తదితర శాఖల్లో 40శాతం మంది ఉద్యోగులను సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపట్టారు. కాగా, యూనియన్ నాయకుల బదిలీల విషయంలో ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ కాలంగా ఒకేచోట పాతుకుపోయిన చాలామంది ఉద్యోగులకు బదిలీకాక తప్పలేదు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న పలు శాఖల అధికారులు రేపటి(సోమవారం) నుంచి కొత్త స్థానాల్లో విధుల్లో చేరనున్నారు. జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిసెంట్లు, నాయబ్ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అకౌంటెంట్లు, రెవెన్యూ ఆఫీసర్లు, మేనేజర్లు, కార్యదర్శులు, తదితరులు బదిలీల్లో ఉన్నారు.

బూత్‌స్థాయిలో పటిష్టంగా బీజేపీ

వికారాబాద్, జూలై 20 : బీజేపీ బూత్ స్థాయిలో ఎంతో పటిష్టంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి విజయరామారావు అన్నారు. శనివారం వికారాబాద్‌లోని సత్యభారతి గార్డెన్స్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. విజయరామారావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే బలమని, బూత్ స్థాయిలో ఏ పార్టీకీ లేనంతగా బలమైన కేడర్ ఉందన్నారు. అందుకే పార్టీ ఇచ్చిన ఏ కార్యక్రమమైనా బూత్ స్థాయివరకూ విజయవంతమవుతుందన్నారు. నరేంద్రమోదీని 3వ సారి ప్రధానమంత్రిగా చేయడానికి బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు ఎంతో శ్రమించారని, అందుకు ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. దేశంలో మోదీతోనే సమగ్రత, సమైక్యత సాధ్యమని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించి ప్రజలను జాగృతం చేస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు, పార్లమెంట్ ఎన్నికలకు భారీగా ఓటు బ్యాంకు పెరిగిందని, ఇదే ఊపును స్థానిక సంస్థల ఎన్నికల్లో చూపుతామన్నారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉండటం గర్వకారణమన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూనే దేశం, ధర్మం కోసం పనిచేస్తుందన్నారు. పార్టీ క్రమశిక్షణకు మారుపేరని అన్నారు. జిల్లాలోని సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా నాయకులు బలపరిచారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు శివరాజు, కరణం ప్రహ్లాదరావు, సదానందరెడ్డి, రమేష్ కుమార్, పూనంచంద్ లాహోటీ, గిరిమోని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు విజయభాస్కర్‌రెడ్డి, కృష్ణ, రాంచందర్, రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామరావు

ఇంటివద్ద విద్యార్థులను చదివించాలి

- తల్లిదండ్రులకు డీఈవో రేణుకాదేవి సూచన

బంట్వారం (కోట్‌పల్లి), జూలై 20 : ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఇంటివద్ద తల్లిదండ్రులు విద్యార్థులతో చదివించాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. శనివారం కోట్ పల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు, పుస్తకాలు, యూనిఫాం ఇతరత్రా సమకూర్చామని, డిజిటల్ క్లాసులు వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని కోరారు. విద్యార్థులకు ఉచితంగా రెండు జతల యూనిఫాం, పుస్తకాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని చెప్పారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై.. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రప్ప, విద్యా కమిటీ చైర్మన్ శాంతమ్మ, ఉమాదేవి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బంట్వారం (కోట్‌పల్లి) : మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

నాగసమందర్ పాఠశాలను సందర్శించిన డీఈవో

ధారూరు : మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సందర్శించారు. పాఠశాలలోని వంట గదిని, వంటకాలను, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం సరిగ్గా లేకపోవటంతో ఇంజనీర్‌తో మాట్లాడి పనులను నాణ్యతగా చేసేలా చూడాలని ఆమె సూచించారు. అనంతరం పాఠశాల తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యా బోధనపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆమె చర్చించారు.

జుంటివాగు ఖాళీ

- కూలిన చెక్‌డ్యామ్ వింగ్‌వాల్.. నీరంతా వృథా
- రైతుల ఆందోళన.. పట్టించుకోని అధికారులు

బషీరాబాద్, జూలై 20: బషీరాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలోని జుంటివాగు ఖాళీ అయ్యింది. నాలుగైదు రోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నా.. చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథాగా పోతోంది. గతేడాది ఈ సమయానికి పూర్తిస్థాయిలో నిండి జుంటివాగు నుంచి నీరు పరవళ్ల తొక్కగా.. ప్రస్తుతం వెలవెలబోయి కనిపిస్తోంది. చెక్‌డ్యామ్‌కు తూము లేకపోవడంతో వరద నీరంతా ఎప్పటికప్పుడు ఖాళీ అవుతోంది. జుంటివాగు చెక్‌డ్యామ్ ఎగువ భాగం ఏడాదంతా నీటితో కళకళలాడేదని, ఎవరూ పట్టించుకోక నిండు వర్షాకాలంలో ఖాళీగా దర్శనమివ్వడంతో రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉండగా చెక్‌డ్యామ్ ఎడమవైపు వింగ్‌వాల్ కూడా శిథిలావస్థకు చేరి గోడలు కూలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగే వదిలేస్తే ఆనవాళ్లు కూడా లేకుండాపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అధికారులకు తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జుంటివాగు చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని చుట్టుపక్కల గ్రామాల రైతులు కోరుతున్నారు.


కూలిన జుంటివాగు చెక్‌డ్యాం వింగ్‌వాల్, వృథాగా పోతున్న నీరు

కేకేను కలిసిన ఎమ్మెల్యేలు



కేకేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు/పరిగి, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన కే.కేశవరావును తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి కెకెకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి కేకేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కేశవరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

రూ.3.70కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, జూలై 20: నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.3.70కోట్లు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.3.70కోట్లు కేటాయించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, డీఈఈ సుదర్శనం రఘు, మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

పోచారం అభివృద్ధికి రూ.24లక్షలు

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.24లక్షలు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి తెలిపారు. ఆయన అధ్యక్షతన శనివారం అత్యవసర సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో సీజనల్ వ్యాధులు, నూతన విద్యుత్ లైన్ల కొనుగోలు వంటి అభివృద్ధి పనులకు రూ.24లక్షలు కేటాయిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండటంతో గడ్డి పెరిగి ఈగలు దోమలు వ్యాపించే అవకాశం ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా బోనాల పండుగ సందర్భంగా నూతన విద్యుత్ లైట్ల కొనుగోలుకు ఈ నిధులను వినియోగించాలని తీర్మానించారు. దోమల నివారణ చేపట్టాలని, వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు మహేష్, సాయిరెడ్డి, వెంకటేష్‌గౌడ్, హరిప్రసాదరావు, సుర్వి రవీందర్, శ్రీలత, సరిత, పోచమ్మ, సుధాలక్ష్మి, ఏఈ మహిపాల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

క్రైం కార్నర్

వాగులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



సంతోష్ మృతదేహం

మేడ్చల్ టౌన్, జూలై 20: మండలంలోని పూడూరు గ్రామానికి చెందిన సంతోష్(29) తన మిత్రుడితో కలిసి వాగులో శుక్రవారం చేపలు పట్టడానికి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. ఆ యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. శుక్రవారం సాయంత్రం చీకటి పడేంత వరకూ స్థానికులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ సంతోష్ ఆచూకీ లభించలేదు. తిరిగి శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా వాగులోని ముళ్లకంపల్లో సంతోష్ మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని స్థానికుల సాయంతో బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేయిస్తున్న మాధవయ్య

మూడుచింతలపల్లి, జూలై 20: పట్టుబడిన మద్యం బాటిళ్లను శామీర్‌పేట్ పోలీసులు ధ్వంసం చేశారు. శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం బెల్టుషాపులపై నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన 63 కేసుల్లో 690లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ మాధవయ్య పర్యవేక్షణలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

దోమ, జూలై 20: మండలంలోని అయినాపూర్ గ్రామంలోని 8వ వార్డు ఊరడమ్మ కాలనీలో సీసీరోడ్డు లేకపోవడంతో వర్షం కురిస్తే చిత్తడిగా మారుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో రోడ్డుతో పాటు డ్రైనేజీ వ్యవస్థ లేదని, వర్షం పడితే తీవ్ర అవస్థలు తప్పడంలేదని చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బషీరాబాద్: మండల కేంద్రంలోని ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. ఇందులో వర్షపు నీరు చేరడంతో కంటలను తలపిస్తోంది. స్థానికంగా ప్రధాన మార్గం కావడంతో కాలినడకన వెళ్లాలంటే స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు లోతైన గుంతలతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శామీర్‌పేట: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని రోడ్లు బురదతో చిత్తడవుతున్నాయి. జనజీవనం స్తంభించింది. మండలంలోని లోతట్టు ప్రాంతాలు కురుస్తున్న వర్షం నీరు మూలంగా జలమయమవుతున్నాయి. అలాగే నిర్విరామంగా కురుస్తున్న వర్షాల మూలంగా సరైన ఆహారంలేక పశువులు, జీవాలు అనేక అవస్థలు పడుతున్నాయి. కాగా కురుస్తున్న వర్షాల మూలంగా మండలంలోని చెరువుల్లో, కుంటల్లో నీరు వచ్చి చేరుతుంది.



అయినాపూర్ గ్రామంలో బురదమయంగా మారిన అంతర్గత రోడ్డు



బషీరాబాద్‌లో అడుగడుగునా నీటి గుంతలు



తాండూరు రూరల్: నిండిన సిరిగిరిపేట్ ఊరచెరువు



శామీర్‌పేటలో కురిసిన వాన



పరిగి: తిరుమలరెసిడెన్సీలో రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపు నీరు



యాలాలలో కురుస్తున్న వర్షం, బురదమయంగా రోడ్డు



తాండూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కళకళలాడుతున్న పంటలు



తాండూరు రూరల్: కొత్లాపూర్ శివారులో వర్షాలకు కళకళలాడుతున్న కంది, పెసర మిశ్రమ పంట

తాండూరు రూరల్, జూలై 20: తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని బషీరాబాద్, తాండూరు, యాలాల, పెద్దేముల్ మండలాల్లో పంటలు కళకళలాడుతున్నాయి. బషీరాబాద్, తాండూరు, యాలాల, పెద్దేముల్ మండలాలతో పాటు తాండూరు మండలంలోని కొత్లాపూర్, సంగెంకలాన్, మల్కాపూర్, ఐనెల్లి, జినుగుర్తి, ఉద్దండాపూర్, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, గుండ్లమడుగుతండా, మైసమ్మగడ్డతండా, గోనూరు, నారాయణపూర్, నారాయణపూర్ గ్రామాల్లో కంది 45,000 ఎకరాలు, పెసర పంట 10,000ఎకరాలు, పత్తి 37,000 ఎకరాలు, మినుము 6000 ఎకరాలు, సోయాబీన్ 800 ఎకరాల్లో పంటలు ఆన్‌లైన్‌లలో నమోదు చేసినట్లు తాండూరు ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. ప్రస్తుతం ఈ పంటలు కురిసిన వర్షాలకు కళకళలాడుతున్నాయని తెలిపారు. మరోవారం రోజుల్లో రైతులు వరినాటు కూడా ప్రారంభించే అవకాశం ఉందన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలు లబ్ధి పొందాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, జూలై 20: ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలు లబ్ధి పొందేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు కృషిచేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ 17వ వార్డుకు చెందిన బొల్లి భాగ్యమ్మ కుటుంబసభ్యులకు రూ.27000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం మల్లారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు సందీప్ గౌడ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా సాయినాథుడి రథయాత్ర



తాండూరు: రథానికి పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు, జూలై 20: కోకట్ రోడ్డులో కొలువుదీరిన షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో సాయిబాబా రథయాత్ర ఊరేగింపు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా సమీపంలో నున్న భవాని మాత దేవాలయం నుంచి రథయాత్ర ప్రారంభమై సాయిబాబా ఆలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, భావనోళ్ల శంకర్ యాదవ్, చంద్రకళ దంపతులు, రాజు, సాయిలుగౌడ్, మల్లారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం(నేడు) సామూహిక పుష్పాభి షేకం, అఖండ భజన సాయి వ్రతాలు, పల్లకీ సేవ, మహానైవేద్యం కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా కోకట్ రోడ్డులో గల షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

నేడు గురుపూజోత్సవం

కీసర: గురు పౌర్ణమి సందర్భంగా నేడు సాయిధామంలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు సాయిధామం ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా నేడు ఉదయం స్వామివారికి కాగడహారతి, దత్త స్వామికి క్షీర జలాభిషేకం గురుదేవులకు క్షీరాభిషేకం, అష్టోత్తర శతనామ పూజ, బాబా వారికి అష్టోత్తర శతనామ పూజ, సాయినాథుల వారికి లక్ష పుష్పార్చన, గురుపూజ, గురుస్తుతి, శ్రీరామానంద ప్రభూజీ వారి ప్రవచనం, మహా నివేదన, మధ్యాహ్న హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పరిగి: మాతృభూమి ఫౌండేషన్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ పి.భాస్కరయోగి ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలోని శ్రీనివాసనగర్ కాలనీ వెనుకాల గల మామిడి తోటలో గురుపూర్ణిమ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జ్యోతి ప్రజ్వలన, వ్యాసపూజ, గురుపూర్ణిమ గురించి సందేశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ, న్యూఢిల్లీ చైర్‌పర్సన్ విజయభారతి, వక్తగా ప్రముఖ ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి, బీఎస్ శర్మ ప్రసంగాలు ఉంటాయని తెలిపారు.

విద్యార్థులు వందశాతం హాజరవ్వాలి

పరిగి, జూలై 20: విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూడాలని పరిగి ఎంఈవో హరిశ్చందర్ సూచించారు. మండలంలోని సయ్యద్‌మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పేరేంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మూడవ శనివారం పీటీఎం మీటింగ్‌లు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీణ, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: ఇప్పయిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పాండురంగయ్య మాట్లాడుతూ విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని తెలిపారు. విద్యార్థుల హోం వర్క్ పరిశీలించాలని, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ సుధారాములు, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సరిత, రుక్మిణి, శివశంకర్, యాదయ్య, శ్యామ్ సుందర్, మహమూద్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులు పాల్గొన్నారు.

23న వేలం

వికారాబాద్, జూలై 20: మునిసిపల్‌లోని 13 ఎలక్ట్రికల్ వాహనాలను, డంపర్ బిన్స్ 15, ఇతర సామగ్రి వేలం వేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న మంగళవారం ఉదయం 11గంటలకు మునిసిపల్ ఆవరణలో బహిరంగ వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ఫీజు డిపాజిట్ రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు మునిసిపల్‌కు ఎలాంటి బకాయిలు ఉండకూడదన్నారు. వేలం పొందాక మూడు రోజుల్లో డబ్బులు చెల్లించాలన్నారు. డబ్బులు చెల్లించకుంటే రెండో స్థానంలో ఉన్న వ్యక్తికి ఇవ్వబడుతుందన్నారు. వివరాలకు 7702079917 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హరీశ్‌రావు రాజీనామా చేయాలి

కీసర, జూలై 20: మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వెంటనే రాజీనామా చేయాలని కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చినమాట ప్రకారం రుణమాఫీ చేశాడని, ఆగస్టు 15 లోపు రూ.2లక్షల వరకు ఉన్న రైతుల పంట రుణాలను మాఫీ చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసినట్లు హరీశ్‌రావు చెప్పిన మాట ప్రకారం రాజీనామా చేసి తన మాటను నిలబెట్టుకోవాలని రామిడి విజయ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

నవాంద్గీలో 162 మంది రైతులకు రుణమాఫీ

బషీరాబాద్, జూలై 20: నవాంద్గీ సొసైటీలో 162 మంది రైతులకు గానూ రూ.78, 48వేల 357 మాఫీ అయినట్లు ఆ సంఘం చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, సీఈవో బందెయ్యగౌడ్ శనివారం తెలిపారు. సొసైటీలో రూ.లక్షలోపు రుణం పొందిన రైతులు 638 మంది ఉండగా, ప్రస్తుతం 162 మందికి రుణమాఫీ వర్తించిందన్నారు. మిగతా 476మంది రైతులకు రెండో విడతలో వచ్చే అవకాశం ఉందని వారంటున్నారు. ఇదిలా ఉండగా రూ.లక్ష రుణం తీసుకున్న చాలా మంది రైతులకు మాఫీ వర్తించకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. సొసైటీకి చేరుకుని అధికార సిబ్బందిని ఆరా తీస్తూ నిరాశతో వెళ్లిపోతున్నారు.

సంక్షిప్తంగా..

● **కీసర:** వన మహోత్సవం పథకంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటి లక్ష్యాన్ని అధిగమించాలని ఎంపీడీవో గ్యామా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వనమహోత్సవం పథకంపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. తీసిన గుంతలల్లో వెంటనే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన కార్యదర్శులకు తెలిపారు. నర్సరీలో ఉన్న మొక్కలు, ఏఏ ప్రాంతాలల్లో మొక్కలు నాటాలి అనే ప్రణాళికను ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

● **కొడంగల్:** అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని కొడంగల్‌లోని శ్రీ నేతాజీ విద్యాభవన్ పాఠశాలలో శనివారం విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వంశీ అంతర్జాతీయ చెస్ దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు.

● **దోమ:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని దోమ ఎంపీడీవో మహేశ్‌బాబు, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజీరెడ్డి తెలిపారు. శనివారం గ్రామ పంచాయతీలో మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు యాదయ్యగౌడ్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** శామీర్‌పేట గ్రామ సమీపంలోని సాయిబాబా ఆలయ కాలనీకి రోడ్డువేయాలని గ్రామ నాయకులు కోరుతున్నారు. శామీర్‌పేట గ్రామ నాయకులు డి.జి. వెంకటేశ్‌గౌడ్, మల్లేశ్, సాయి, సుధాకర్‌రెడ్డి, అక్షయ్‌కుమార్, తదితరులు శనివారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు.

● **దోమ:** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ అంటూ డ్రామా చేస్తోందని దోమ మండల మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మాయ మాటలతో మోసగిస్తోందన్నారు. రబీ, వానాకాలంలో అందించాల్సిన రైతు భరోసా ఎగ్గొట్టినందుకు సంబురాలు చేసుకుంటున్నారా? అని ఈ సందర్భంగా ప్రశ్నించారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సుధీర్ రెడ్డిని శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

● **దోమ:** ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకుంటే ఆరోగ్యానికి శ్రేయస్కరమని దోమ గ్రామ సీతమ్మ మహిళా సంఘం సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో శనివారం ఆషాఢమాసం సందర్భంగా మహిళలు గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

14మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

బషీరాబాద్, జూలై 20: మండలంలో భారీ సంఖ్యలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. గొట్టిగకలాన్ జీపీకార్యదర్శి నసీరోద్దీన్ తాండూరు మండలం వీరిశెట్టిపల్లి, హంక్యానాయక్‌తండా కార్యదర్శి యాలాల మండలం బండమీదిపల్లి, నవాంద్గీ కార్యదర్శి ఈ.నర్సిరెడ్డి తాండూరు మండలం రాంపూర్‌మీదితండా, నవాల్గ కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి తాండూరు మండలం పర్వత్‌పూర్, మాసన్‌పల్లి కార్యదర్శి జీవన్‌బాస్కార్ అనంతసాగర్ కుల్కచర్ల, మంతట్టి కార్యదర్శి శ్రీనాథ్ యాలాల మండలం రస్నం, దామర్‌చెడ్ కార్యదర్శి నాగప్రసాద్ యాలాల మండలం హాజీపూర్, ఇస్మాయిల్‌పూర్ కార్యదర్శి బి.మహేష్ బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్‌కి బదిలీ అయ్యారు. అదేవిధంగా బాబునాయక్‌తండా కార్యదర్శి నరేష్‌గౌడ్ తాండూరు మండలం గుండ్లమడుగుతండాకు, మంతన్‌గౌడ్ కార్యదర్శి దేవేందర్ బషీరాబాద్ మండలం కంసాన్‌పల్లి(ఎం), కొత్లాపూర్ కార్యదర్శి అమృతప్ప బషీరాబాద్ మండలం మంతట్టి, పర్వత్‌పల్లి కార్యదర్శి సంజీవ్‌కుమార్ బషీరాబాద్ మండలం ఇస్మాయిల్‌పూర్, కంసాన్‌పల్లి (ఎం) కార్యదర్శి బి.విశాల్ బషీరాబాద్ మండలం కొల్లాపూర్ పంచాయతీలకు బదిలీపై వెళ్లనున్నారు.

ఇద్దరు ఆర్ఐ, సర్వేయర్ బదిలీ

తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు ఆర్ఐలు రాజిరెడ్డి, ఖాజాలు బదిలీ అయ్యారు. అదేవిధంగా కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ శ్రీహరినాయక్, అటెండర్ లక్ష్మమ్మ కూడా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆర్ఐ రాజిరెడ్డి ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తుండగా, మరో ఆర్ఐ ఖాజా కులకచర్ల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వీరిద్దరితో పాటు సర్వేయర్, అటెండర్ కూడా నాలుగు సంవత్సరాలుగా పనిచేయడంతో బదిలీ తప్పనిసరి అయ్యింది. ఇద్దరు ఆర్ఐలు రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, సర్వేయర్ దుద్యాల మండలానికి, అటెండర్ యాలాల మండలానికి బదిలీపై వెళ్లారు. అటెండర్ లక్ష్మమ్మకు ఉత్తర్వులు రాగా ఆర్ఐ సర్వేయర్‌కు ఉత్తర్వులు రావాల్సి ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

వాణిజ్య దుకాణాలకు టెండర్లు నిర్వహించాలి

పరిగి,జూలై 20: పరిగి మునిసిపల్ పరిధిలోని 27 వాణిజ్య దుకాణాలకు టెండర్ ప్రక్రియను చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. గత ఏప్రిల్ 30 నాటికి టెండర్ గడువు ముగిసిందని, మూడు నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి నష్టం జరుగుతోందన్నారు. కొంతమంది ప్రజాప్రతినిధులు టెండర్ ప్రక్రియ జరుగకుండా లోలోపలే పూర్తిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు పాటించాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు రమేశ్, వెంకటయ్యలు ఉన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ సర్టిఫికెట్ల పంపిణీ

కొడంగల్ రూరల్, జూలై 20: పట్టణంలోని వీబీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో వేసవిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం శిక్షణ కేంద్రం నిర్వాహకుడు భీమరాజు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు కంప్యూటర్ శిక్షణ ఎంతో దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోలేం

వికారాబాద్, జూలై 20: ఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోలేమని వారు ఎక్కడ విధులు నిర్వహించినా రేపటి భవిష్యత్తుకు మంచి విద్య బుద్ధులు నేర్పేవారని మద్గుల్ చిట్టంపల్లి కౌన్సిలర్ గోపాల్ అన్నారు. శనివారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు విశ్వం, వెంకటయ్య, సుధాకర్, శ్రీదేవి, నాగరాణి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎక్కడికి వెళ్లిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తారన్నారు. రేపటి విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది గురువులేనని తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దోమ, జూలై 20: రైతు బీమాకు జూన్ 28, 2024 నాటికి ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల వివరాలు వ్యవసాయ శాఖకు అందినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రభాకర్‌రావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల్లోపు గల రైతులు ఆగస్టు 4వ తేదీలోపు సెక్టార్ వ్యవసాయశాఖ అధికారికి దరఖాస్తులను అందించాలని కోరారు. రైతు బీమా దరఖాస్తు ఫారం, పట్టాపాసుబుక్, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతు బీమాలో తప్పుల సవరణకు ఈనెల 30వరకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

సైబేజ్ ఆధ్వర్యంలో హరితహారం

పూడూరు, జూలై 20: హైదరాబాద్ గచ్చిబౌలిలో సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో దేవనోనిగూడలో శనివారం గ్రామస్తులతో కలిసి హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా నిర్మించిన స్మశాన వాటిక దగ్గరలోని కొండలో నీలగిరి, జామ, సీతాఫల్ 300 మొక్కలను నాటారు. కార్యక్రమంలో కంపెనీ సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ ఎ.సురేష్, మేనేజర్ కిరన్‌కుమార్, ఉద్యోగులు గోపి, సత్య, రాజు, గుల్షన్, తిరుపతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్'

ఘట్‌కేసర్ రూరల్, జూలై 20: నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వారిని మోసం చేసిందని బీజేపీ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని ఇందిరాపార్కులో శనివారం జరిగిన నిరుద్యోగ మహాధర్నా కార్యక్రమంలో కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు, బీజేవైఎం, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



విద్యుత్ వైర్లను చూపిస్తున్న రైతులు

బషీరాబాద్, జూలై 20:నవాంద్గీ శివారు వ్యవసాయ పంట పొలాల్లో 11కేవీ విద్యుత్ లైన్‌చేతికి అందే స్థాయిలో కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. దీంతో రైతన్నలు ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లకు మధ్యలో కర్రలు సపోర్టుగా పెట్టిన గాలిదుమారానికి పడిపోతున్నాయని వారంటున్నారు. మా పొలాల్లో కలుపుతీత పనులకు కూడా కూలీలు రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతు కొండాల్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.